కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశ వర్కర్లు

ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలి

కలెక్టరేట్ ఎదుట ఆశ వర్కర్ల ధర్నా

హనుమకొండ, మార్చి 19 : ఆశ వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేల ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బుధవారం కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కలెక్టరేట్‌లో విద్యుత్ శాఖకు సంబంధించిన బహిరంగ విచారణ జరుగుతున్న నేపథ్యంలో ఆశ కార్యకర్తలు గేట్లను నెట్టి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా సుబేదారి పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులు వారికి నచ్చజెప్పి డీఎంహెచ్‌వో అప్పయ్యకు ఆశ వర్కర్లతో వినతిపత్రం ఇప్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్, ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాసు మాధవి మాట్లాడుతూ.. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశ వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం ప్రకటించాలని డిమాండ్ చేశారు. తాము అధికారంలోకి వస్తే రూ.18 వేలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచినా అమలు చేయకపోవడం సరికాదని విమర్శించారు. ఆశ వర్కర్లకు ఇన్సూరెన్స్ రూ.50లక్షలు వర్తింపజేయాలని, అదనపు పనులకు అదనపు వేతనం ఇవ్వాలని, పారితోషకం లేని పనులను చేయించొద్దని, అధికారుల వేధింపులు ఆపాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, పండగ, వారాంతపు సెలవులకు సర్కులర్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 21న అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఎదుట ధర్నాలు చేస్తామని, 24న చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొట్ల చక్రపాణి, రాజేశ్వరి, శ్రీవాణి, కల్పన, జ్యోతి, సూర్యకళ, రజిత, లీల పాల్గొన్నారు.

ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ల సందర్శన

ఉనికిచెర్ల ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో

నయీంనగర్, మార్చి 19 : ధర్మసాగర్ పీహెచ్‌సీ పరిధిలోని ఉనికిచర్ల, హసన్‌పర్తి పీహెచ్‌సీ పరిధిలోని దేవన్నపేట ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లను డీఎంహెచ్‌వో అప్పయ్య బుధవారం సందర్శించారు. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం, ప్రస్తుతం నిర్వహిస్తున్న లెప్రసీ సర్వే, ఎన్‌సీడీ రీస్క్రీనింగ్‌ను పరిశీలించారు. జిల్లా మాస్ మీడియా అధికారి అశోక్‌రెడ్డి, సంతోష్, మురళి, అరుణ పాల్గొన్నారు.

తురుక కుంటను రక్షించాలి

హనుమకొండ, మార్చి 19 : ఐనవోలు మండలం పున్నేలు గ్రామంలోని బాబాయ్ కుంట (తురకకుంట) ను రక్షించాలని వీసీకే జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. బుధవారం కమిటీ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. వీసీకే పార్టీ అధ్యక్షుడు రవి, సుమన్‌బాబు ఉన్నారు.

విద్యుత్‌పై వినియోగదారుల్లో అవగాహన కల్పించాలి

- సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలి
- టీజీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ దేవరాజు నాగార్జున

మాట్లాడుతున్న టీజీఈఆర్సీ చైర్మన్ డాక్టర్ జస్టిస్ దేవరాజు నాగార్జున

హనుమకొండ, మార్చి 19 : విద్యుత్ వినియోగదారులకు చైతన్యం కల్పించేలా గ్రామ గ్రామాన అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని టీజీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ దేవరాజు నాగార్జున ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో టీజీఎన్పీడీసీఎల్ 2025-26 ఆర్థిక సంవత్సరానికి సవరించిన ఆదాయ ఆవశ్యకత, రిటైల్ సరఫరా ధరలు, క్రాస్ సబ్సిడీ సర్ చార్జీల ప్రతిపాదనలపై బహిరంగ విచారణ నిర్వహించారు. ముందుగా ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి కంపెనీ సమగ్ర సమాచారాన్ని వివరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. ఎటువంటి విద్యుత్ టారిఫ్ పెంపు లేదన్నారు. మెరుగైన సేవలు అందిస్తున్న ఎన్పీడీసీఎల్ యాజమాన్యాన్ని అభినందించారు. సీఎండీ మాట్లాడుతూ.. గ్రీన్ ఎనర్జీని ఎంచుకునే సంబంధిత ఎల్‌టీ, హెచ్‌టీ వినియోగదారులకు సాధారణ టారిఫ్ కంటే యూనిట్‌కు రూ.0.66 గ్రీన్ టారిఫ్ విధింపు కొనసాగిస్తున్నామన్నారు. వ్యవసాయ వినియోగదారులందరికీ అంతరాయం లేని విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. వ్యవసాయ వినియోగదారులు రాష్ట్రంలో ఎక్కడైనా మీసేవ కేంద్రంలో తమ దరఖాస్తు నమోదు చేసుకోవచ్చని చెప్పారు. వినియోగదారుల ఫిర్యాదులను పరిష్కరించేందుకు కస్టమర్ కేర్ సెంటర్‌తో పాటు టోల్ ఫ్రీ నంబర్ 1800 425 0028, 1912 ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యుత్ అధికారులందరూ నిబద్ధతతో పనిచేస్తున్నారని స్పష్టం చేశారు. పొలాల మధ్య ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను రోడ్డు పక్కకు మార్చడానికి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే జేఎల్ఎం, సబ్ ఇంజినీర్, అసిస్టెంట్ ఇంజినీర్ పోస్టుల నియామకం చేపడుతామని తెలిపారు. ఎన్పీడీసీఎల్ ఇన్‌చార్జి డైరెక్టర్లు అశోక్‌కుమార్, సదర్‌లాల్, తిరుపతిరెడ్డి, మధుసూదన్, సీజీఆర్ఎఫ్ చైర్మన్లు వేణుగోపాలచారి, నారాయణ, సీజీఎంలు తిరుమలరావు, అశోక్, రాజుహన్, బికంసింగ్, రవీంద్రనాథ్, వెంకటరమణ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పృథ్వీ

బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం

హనుమకొండ చౌరస్తా, మార్చి 19 : రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి సరైన కేటాయింపులు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి రాంబాబు మండిపడ్డారు. బుధవారం కేయూలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.3 లక్షల కోట్ల పైచిలుకు బడ్జెట్‌లో 10 శాతం కూడా విద్యకు కేటాయించకపోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన విద్యా కమిషన్ 20 శాతం నిధులు కేటాయించాలని చేసిన సూచనలను తుంగలో తొక్కిందన్నారు. గత సంవత్సరం కంటే తక్కువ నిధులు కేటాయించడం దేనికి సంకేతమో ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విద్యారంగానికి కేవలం 7.57 శాతం నిధులు మాత్రమే కేటాయించి విద్యార్థులకు ఇచ్చిన హామీని పూర్తిగా విస్మరించిందని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటి పృథ్వీ, ఉపాధ్యక్షులు నరసింహారావు మండిపడ్డారు. కాకతీయ యూనివర్సిటీ గెస్ట్ హౌస్‌లో ముఖ్యకార్యకర్తల సమావేశం బాలకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను వెంటనే సవరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు అజయ్, కాకతీయ యూనివర్సిటీ ప్రధాన కార్యదర్శి కావ్య, ఉపాధ్యక్షులు అనూష, గణేశ్, యాదగిరి పాల్గొన్నారు.

డాక్టరేట్ సాధించిన అంధుడు సాయిచరణ్

హనుమకొండ చౌరస్తా, మార్చి 19 : కాకతీయ యూనివర్సిటీ చరిత్ర విభాగం పరిశోధకుడు వడ్డేపల్లి సాయిచరణ్ డాక్టరేట్ సాధించారు. చరిత్ర విభాగం ఆచార్యులు తాళ్లపల్లి మనోహర్ పర్యవేక్షణలో 'హైదరాబాద్ రాజ్యంలో వైద్య, ఆరోగ్య సేవలు' అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ ప్రకటించినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి కట్ల రాజేందర్ తెలిపారు. ఖమ్మం జిల్లా బల్లెపల్లికి చెందిన సాయిచరణ్ చిన్నవయసులోనే సరైన చికిత్స అందక రెండు కళ్లు కోల్పోయాడు. అయినా మొక్కవోని దీక్షతో హైస్కూల్ విద్య ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఖమ్మంలో, ఎస్వీ జూనియర్ కాలేజీ కోదాడలో ఇంటర్, ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల ఖమ్మంలో డిగ్రీ, కాకతీయ విశ్వవిద్యాలయంలో ఎంఏ హిస్టరీ పూర్తిచేశారు. తాను విద్య అభ్యసిస్తున్న సమయంలో తన స్నేహితుడు నాగేశ్వర్‌రావు, తన భార్య నాగరాణి స్ట్రైబ్‌లుగా వ్యవహరించే వారని మనోహర్ తెలిపారు. ప్రస్తుతం ఆయన హుజూరాబాద్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చరిత్ర లెక్చరర్‌గా పనిచేస్తున్నారు.

ఉరేసుకొని వృద్ధుడి ఆత్మహత్య

శాయంపేట మార్చి 19 : కడుపు వాపు భరించలేక మనస్తాపానికి గురైన వృద్ధుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన పత్తిపాక గ్రామంలో జరిగింది. ఎస్సై జక్కుల పరమేశ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మిరియాల ఓదెలు (70) కొన్ని సంవత్సరాలుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఆస్పత్రులు తిరుగుతూ మందులు వాడినప్పటికీ తగ్గలేదు. ఈ క్రమంలో అతడు ఈ నెల 18న ఇంట్లో ఉరేసుకొన్నాడు. భార్య సమ్మక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

హాస్టల్‌లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

కలెక్టర్ ప్రావీణ్య

భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ, మార్చి 19 : హాస్టల్‌లో విద్యార్థులకు సౌకర్యాలు మెరుగ్గా ఉండేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. బుధవారం నయీమ్‌నగర్‌లోని బీసీ సంక్షేమ హాస్టల్‌ను సందర్శించారు. హాస్టల్లో విద్యార్థులు ఎంతమంది ఉన్నారు? సౌకర్యాలు ఎలా ఉన్నాయని బీసీ సంక్షేమ అధికారి రామ్‌రెడ్డి, హాస్టల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వంట గదిలో విద్యార్థుల కోసం తయారు చేసిన భోజనాన్ని తనిఖీ చేశారు. మెనూ చార్ట్‌ను పరిశీలించారు. విద్యార్థులతో సమావేశమై ఏయే కళాశాలల్లో చదువుతున్నారు? ఏయే ప్రాంతాలకు చెందిన వారు? కళాశాలలకు ఎలా వెళ్తారని అడిగి తెలుసుకున్నారు. స్టడీ అవర్స్, ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం భోజనం గురించి విద్యార్థులను కలెక్టర్ అడిగారు. వాటర్ సప్లయ్ ఎలా ఉంది? ఫుడ్ కమిటీ ఉందా? కొత్త మెనూ ప్రకారం ఫ్రూట్స్ ఇస్తున్నారా? అని ఆరా తీశారు. కళాశాలకు వెళ్లి వచ్చిన తర్వాత హాస్టల్ వార్డెన్ అనుమతి లేనిదే బయటకు వెళ్లొద్దన్నారు.

పంటలు ఎండిన రైతులను ఆదుకోవాలి

ఎల్కతుర్తి, మార్చి 19 : పంటలు ఎండిపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని టీఆర్ఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు హింగె భాస్కర్ డిమాండ్ చేశారు. మండలంలోని గోపాల్‌పూర్ గ్రామంలో ఎండుతున్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు అప్పులు తెచ్చి మరీ పెట్టుబడులు పెట్టారని, ఇప్పుడు పంటలు ఎండిపోతుండడంతో తీవ్ర నైరాశ్యంలోకి వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం యాసంగిలో రైతులకు అవగాహన కల్పించి ఆరుతడి పంటలు వేయిస్తే ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యమే రైతులకు శాపంగా మారిందని చెప్పారు. అధికారులు ఎండిపోయిన పంటలను సర్వే చేయాలని, వెంటనే రైతులకు ఎకరాకు రూ. 40వేల చొప్పున పరిహారం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో రైతు రక్షణ సమితి మండలాధ్యక్షుడు కొక్కు తిరుపతి, కోదాటి మాధవరావు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులపై సమీక్ష

కమలాపూర్, మార్చి 19 : మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న పనులపై బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో బాబు మాట్లాడుతూ.. ఉపాధి కూలీలకు ఎండ దెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఉదయం పూటే పనులు మొదలయ్యేలా చూడాలని, కూలీ గిట్టుబాటు అయ్యేలా పనులు కల్పించాలన్నారు. పలు గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏపీవో రమేశ్, ఈసీ కార్తీక్ పాల్గొన్నారు.

ఎర్రగట్టు జాతర ఆదాయం రూ.16లక్షలు

హసన్‌పర్తి, మార్చి 19 : మండలంలోని ఎర్రగట్టు వెంకటేశ్వరస్వామి (ఎర్రగట్టు జాతర) హుండీని బుధవారం ఓ స్వచ్ఛంద సంస్థకు చెందిన మహిళలు లెక్కించారు. వేలాల ద్వారా రూ.6,22,500, శ్రీవారి కల్యాణం టికెట్ల ద్వారా రూ.11,160, శీఘ్ర దర్శనం రూ.68,800, ప్రత్యేక దర్శనం రూ.1,92,450, అర్చన, అష్టోత్తరాలు రూ.60,700, విరాళాలు రూ.12,364, స్వామివారికి కట్నాలు రూ.6,859, గండదీపం రూ.36,232, హుండీ ద్వారా రూ.5,88,225, తైబజార్ రూ.33,966 మొత్తం రూ.16,33,296 లక్షలు వచ్చినట్లు ఆలయ ఈవో వెంకట్రావ్ ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది కంటే రూ.3,49,583 లక్షలు ఎక్కువ ఆదాయం వచ్చినట్లు చెప్పారు.

మహిళలు ఆర్థికవేత్తలుగా ఎదగాలి

విద్యార్థినులతో ప్రిన్సిపాల్ రాజశ్రీరెడ్డి, అనితారెడ్డి

హసన్‌పర్తి, మార్చి 19 : మహిళలు ఆర్థిక వేత్తలుగా ఎదగాలని సుమతీరెడ్డి కళాశాల ప్రిన్సిపాల్ రాజశ్రీరెడ్డి సూచించారు. అనంతసాగర్ శివారులోని సుమతీరెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో మహిళా శక్తి, హక్కులు అంశపై విద్యార్థులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్, కేయూ పాలక మండలి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యురాలు అనితారెడ్డి హాజరయ్యారు. కళాశాల మహిళా రక్షణ సెల్ అధ్యక్షురాలు శ్రీవాణి, శ్వేత, విభాగాధిపతులు సుదర్శన్, మహేందర్, ఏవో వేణుగోపాలస్వామి పాల్గొన్నారు.

నేడు బల్దియా బడ్జెట్ సమావేశం

వరంగల్, మార్చి 19 : గ్రేటర్ కార్పొరేషన్ 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ సమావేశం గురువారం నిర్వహించనున్నారు. మేయర్ గుండు సుధారాణి అద్యక్షతన కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో ఉదయం 11.30 గంటలకు సమావేశం ప్రారంభం కానుంది. ఇప్పటికే కార్పొరేటర్లు, గ్రేటర్ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎంపీ, ఎమ్మెల్సీలకు అధికారులు సమాచారం అందించారు.

పది పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 అమలు : సీపీ

సుబేదారి, మార్చి 19 : ఈ నెల 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరగనున్న పదో తరగతి పరీక్షల సందర్భంగా వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ యాక్టు అమలులో ఉంటుందని సీపీ సన్‌ప్రీత్ సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్ష కేంద్రాలకు 500 మీటర్ల దూరం వరకు గుంపులుగా ఉండొద్దన్నారు. సమీపంలోని ఇంటర్నెట్ సెంటర్స్, జిరాక్స్ షాపులు మూసివేయాలని, ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

కేయూ వీసీని కలిసి సీపీ..

హనుమకొండ చౌరస్తా : వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్ కేయూ వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసిన అనంతరం పలు అంశాలపై వారు చర్చించారు.

కాంగ్రెస్‌లో మరోసారి వర్గపోరు

ప్రొటోకాల్ పాటించకుండా ఎవరికి వారే సీఎం రేవంత్‌రెడ్డికి పాలాభిషేకం

హసన్‌పర్తి, మార్చి 19 : కాంగ్రెస్ పార్టీలో మరోసారి వర్గపోరు రచ్చకెక్కింది. అసెంబ్లీలో బీలకు 42శాతం రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీ ఆమోదం తెలిపిన నేపథ్యంలో బుధవారం హసన్‌పర్తిలో మండలాధ్యక్షుడు పొరెడ్డి మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కాగా, ఒక్క వర్గం వారికే సమాచార ఇచ్చారని ఆ నలుగురే క్షీరాభిషేకం చేశారని పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు అసహనం వ్యక్తం చేశారు. పార్టీ కోసం సొంత ఖర్చులు పెట్టుకొని పనులు చేస్తే ఎవరికి సమాచారం ఇవ్వకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. వివిధ పార్టీల నుంచి వచ్చిన కొత్తవారే పెత్తనం చేస్తున్నారన్నారు. మండలంలో వర్గపోరు జరుగుతుందని పార్టీ నాయకులు చెబుతున్నారు. మండల కేంద్రంలో ఉన్న సీనియర్ నాయకులకు చెప్పకుండా కార్యక్రమాలు చేయడం మంచిది కాదని, ఇలా చేస్తే పార్టీకి నష్టం జరుగుతుందన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఏబీవీపీ విద్యార్థుల ధర్నా

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

సుబేదారి, మార్చి 19 : కలెక్టరేట్ ఎదుట అనుమతి లేకుండా ధర్నా నిర్వహించిన ఏబీవీపీ విద్యార్థులపై సుబేదారి పోలీసులు కేసు నమోదు చేశారు. సుబేదారి ఎస్ఐ సుమన్ తన సిబ్బందితో కలిసి కలెక్టరేట్ ఎదుట బందోబస్తు నిర్వహిస్తుండగా, ఎలాంటి అనుమతులు లేకుండా ఏబీవీపీ విద్యార్థులు ధర్నా నిర్వహించి అక్రమంగా కలెక్టరేట్ గేటు లోపలికి దూసుకువెళ్లారన్నారు. ఎస్సై ఇచ్చిన పిటిషన్ మేరకు 8 మంది ఏబీవీపీ విద్యార్థులపై సుబేదారి పోలీస్‌స్టేషన్ లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వీరిని ప్రోత్సహించిన డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ అమర్ జ్యోతి, మంజులా దేవిపై కూడా కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

కొత్త ఓటర్ల నమోదుకు రాజకీయ పార్టీలు సహకరించాలి

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

ఓటర్ల నమోదు ప్రక్రియపై సమావేశం నిర్వహిస్తున్న బల్దియా కమిషనర్

వరంగల్, మార్చి 20 : కొత్త ఓటర్ల నమోదుకు రాజకీయ పార్టీలు సహకరించాలని తూర్పు రిటర్నింగ్ అధికారి, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే కోరారు. బుధవారం కార్పొరేషన్‌లో పలు రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమ్మర్ రివిజన్ ఆఫ్ ఎలక్ట్రోల్స్‌లో భాగంగా నూతన ఓటర్ల నమోదుపై అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ఎన్నికల కమిషనర్ అదేశాలతో సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. రివిజన్ షెడ్యూల్‌లో భాగంగా ఏప్రిల్ 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఓటరు నమోదుపై వివరించారు. పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ల నమోదు, చేర్పులపై రాజకీయ పార్టీలు శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఇక్బాల్, బీజేపీ, టీడీపీ, వైసీపీ, ఎంఐఎం పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కమర్షియల్ ట్రేడ్ ఫీజుల వసూళ్లపై దృష్టి పెట్టాలి..

గ్రేటర్ పరిధిలో కమర్షియల్ ట్రేడ్ ఫీజుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. కమర్షియల్ ట్రేడ్ ఫీజుల వసూళ్లను వేగవంతం చేయాలన్నారు. వసూళ్ల కోసం శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లతో కాశీబుగ్గ, కాజీపేట సర్కిళ్లలో 7 బృందాల చొప్పున ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గడువులోగా లక్ష్యాన్ని చేరుకోవాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో సీఎం హెచ్‌వో రాజారెడ్డి, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, రవీందర్, ఎంహెచ్‌వో రాజేశ్, ఐటీ మేనేజర్ రమేశ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ, మార్చి 19 : హనుమకొండ టౌన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆపరేషన్స్ డీఈ సాంబారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నక్కలగుట్ట సబ్ స్టేషన్ పరిధిలోని వినాయక నగర్, సర్క్యూట్ గెస్ట్‌హౌస్ రోడ్డులో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30గంటల వరకు, బాలసముద్రం సబ్ స్టేషన్ పరిధిలోని ఎల్ఐసీ ఏరియా, మార్కెట్ ఏరియా, బాలసముద్రం ఏరియాల్లో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3.30గంటల వరకు, వడ్డేపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని ప్రశాంత్‌నగర్, పీజీఆర్ అపార్ట్‌మెంట్స్ ఏరియా, సిద్ధార్థనగర్ ఏరియాల్లో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, వడ్డేపల్లి 11 కేవీ ఫీడర్ పరిధిలో విజయ్‌పాల్ కాలనీ, వడ్డేపల్లి, టీచర్స్ కాలనీ -2, జీఎంఆర్ అపార్ట్‌మెంట్స్ ఏరియాల్లో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు.

రాజ్యాంగం ప్రజలందరిది

హనుమకొండ చౌరస్తా, మార్చి 19 : భారతదేశ రాజ్యాంగ వ్యవస్థ ప్రజలందరిదని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ చంద్రయ్య అన్నారు. కాకతీయ వర్సిటీలో 75 సంవత్సరాల భారత రాజ్యాంగం-మైలురాళ్లు సమస్యలు సవాళ్లు' అనే అంశంపై నిర్వహించిన రెండ్రోజుల జాతీయ సదస్సుకు హాజరయ్యారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ.. రాజ్యాంగ వ్యవస్థను 75 సంవత్సరాలుగా భారతీయ ప్రజలు గౌరవిస్తున్నారన్నారు. మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్, ప్రొఫెసర్ మల్లికార్జునరెడ్డి, పూర్వ న్యాయమూర్తి జస్టిస్ పీఎల్ నారాయణ, పూర్వ సంచాలకులు ఎర్రగడ్డ స్వామి, రాధికారాణి, లా ప్రొఫెసర్ సుధాకర్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు.
Cont: 9849145043, 9866584455.
NTW-326545

CHANGE OF NAME
I, BOKKA SARITHA (New name) resident of H.No: 13-220, Ambedkar Nagar, Hasanparthy, Hanumakonda Dist-506371, Telangana,. Changed my name from JANNU SHALIMA (Old name) W/o JANNU SURENDER to BOKKA SARITHA for all purposes.

WANTED
★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-330663-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

బడ్జెట్‌లో రైతాంగానికి నిధులు లేవు

- చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, హనుమాన్‌నగర్, హనుమకొండ

హనుమకొండ చౌరస్తా, మార్చి 19 : నమ్మి ఓటు వేసినందుకు కాంగ్రెస్ పార్టీ నట్టేట ముంచింది. బడ్జెట్ కేటాయింపులు సరిగా లేవు. రైతు రుణమాఫీ పూర్తిగా చేశామని చెప్పడం పచ్చి అబద్ధం. మహిళలకు వడ్డీలేని రుణాలు కేటాయిస్తామని చెప్పి నిధుల విషయంలో బోగస్ మాటలు మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా మహిళలను మోసం చేశాడు. ఆరు గ్యారెంటీలకు మంగళం పాడిన ప్రభుత్వం బడ్జెట్‌లో రైతాంగానికి నిధులు పెంచలేదు. ఇది పేదల నడ్డివిరిచే బడ్జెట్. ముఖ్యమంత్రి మాటలు నీటి మూటలు. అసమర్థ పాలన వల్ల ప్రజలకు ఒరిగింద